


ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర

సంపుటి : 8 సంచిక : 11 పుష్పం : 28-30 20-02-2003



**RAMANA BHASKARA**

**TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE**

**PAGES : 16**

**VOL : 8 ISSUE : 11**

EDITOR
**P.S. RAMA RAJU**

EDITING
**P.H.V. SATYAVATHI**
(HYMA)

**SUBSCRIPTION**
Yearly : **Rs. 150/-**
Each Copy : **Rs. 8/-**

**ADDRESS**
**RAMANA BHASKARA**
SRI RAMANAKSHETRAM
**JINNURU - 534 265**
W.G.Dt., A.P.

**PUBLISHER**
**P.S. RAMARAJU**
LAKSHMI
MODERN RICE MILL
**ULLAMPARRU - PALAKOL**
☎ 08814 - 224589, 224689

**PRINTER**
**SHRIRAM GRAPHICS**
BANK STREET - **PALAKOL**
☎ 08814 - 222438, 221260

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహ భాషణములు, 21-1-03 మల్కిపురం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనమందరము ఈభూమి మీదకు ట్రైనింగ్ పొందటానికి వచ్చాము. మనబుద్ధిలో దోషాలు లేకపోతే మనం ఈ భూమి మీదకు రావలసిన పనిలేదు, మనబుద్ధిలో ఉన్న దోషాలు ఏమిటో శాస్త్రము చెపుతుంది. అందుచేత శాస్త్రాన్ని ఆధారంగా చేసుకొని మనబుద్ధిలో ఉన్న దోషాలు తెలుసుకొని, వాటిలోనుండి విడుదలపొందితే మరల పునర్జన్మరాదు, మరల దుఃఖాలయంలోనికి రానక్కరలేదు. ఈ ప్రపంచంగురించి భగవంతుడు రెండుమాటలు చెప్పాడు. ఇది అశాశ్వతము, దుఃఖాలయం. ప్రపంచంలో ఏదీశాశ్వతంకాదు, ఇదిఅంతా దుఃఖంతోనిండిఉంది, నాయందు భక్తి కలిగిఉండి, నాకిష్టమైన కర్మచేస్తూ, రాగద్వేషాలు తగ్గించుకొంటూ, సత్వగుణాన్ని పెంచుకొంటూ మీరు నాలో ఐక్యంకండి అని భగవంతుడు చెపుతున్నాడు. మనం ఏవస్తువునయితే పొందుదామనుకొంటున్నామో ఆ వస్తువు మనహృదయంలోనే ఉంది. కాని దేహాభిమానం వలన అది ఎక్కడో ఉంది అనుకొంటున్నాము. అది మన హృదయంలోనే ఉంది అన్నసంగతి మనకు గుర్తురావటంలేదు. అది తెలియజేసి, నిన్ను హృదయంలోనికి చేర్చేవాడే గురువు. నన్ను అజ్ఞానంలోనుండి జ్ఞానంలోనికి తీసుకొనిరా, చీకటిలోనుండి వెలుగులోనికి తీసుకొనిరా, మృత్యువులోనుండి బయటకుతీసుకొనివచ్చి అమృతస్థితిని ప్రసాదించు అని వేదంలో ఒకమాట ఉంది. అజ్ఞానాన్ని విడిచిపెట్టి జ్ఞానంలోనికి రావటానికి మనం అందరం ప్రయత్నం చేస్తున్నాము. మనం ప్రయత్నం చేయాలి, కాలం కలిసిరావాలి, ఈశ్వరానుగ్రహం ఉండాలి. ఇవి అన్నీ ఉంటేగాని పనిపూర్తికాదు. ఈశ్వరానుగ్రహం లేకుండా మనవలన ఏమీ అవ్వదు, మనవలన ఏదో అవుతుంది అనుకొంటే అది మన అజ్ఞానానికి గుర్తు. హర్రీ, వర్రీ అండ్ కర్రీ ఈ మూడు తగ్గించుకోమని పెద్దలు చెపుతారు. కొంతమంది ప్రతీచిన్న విషయానికి కంగారు పడతారు. ట్రైనువచ్చే టైముకు స్టేషన్‌కు వెళ్లినా ఆరైలు వస్తుందో రాదో అని వర్రీ అవుతూఉంటారు. కర్రీ తగ్గించటం అంటే నూనెఎక్కువ వేసిన కూరలు, మషాలా వేసిన కూరలు తినవద్దు. ఇది అందరికీ కాదు, సాధకులు మాత్రం హర్రీ, వర్రీ తగ్గించుకోండి కర్రీ దగ్గర జాగ్రత్తగా ఉండండి. ఉద్రేకంగా మాట్లాడవద్దు. మీరు ఉద్రేకంగా మాట్లాడుతూ ఉంటే మీ స్వరూపానికి దూరమవుతారు. అందుచేత రేష్‌స్పీచ్‌వద్దు. మిమ్మల్ని ఎవరైనా పొగుడుతూఉంటే అది నిజం అనుకోవద్దు. మీవల్ల ఏదైనా పనిఉంటే అలాపొగుడుతూ ఉంటారు, అదినిజం అనుకంటే బోల్తాపడతారు. మనందరం గృహస్తులంఅనుకొంటున్నాము. సన్యాసం అంటే ఏమీలేదు. తనకోసం తనే ప్రార్థించుకొనేవాడు గృహస్థుడు, ఇతరులకోసం కూడా ప్రార్థించేవాడు సన్యాసి, నీవు ఇతరులక్షేమం కోరుతూ ఉంటే, వారు బాగుపడాలని కోరుకుంటూ ఉంటే, నీ అభివృద్ధిని నీవు ఎలా కోరుకొంటున్నావో అలాగ ఇతరుల అభివృద్ధినికూడా కోరుతూ ఉంటే నీవు గృహస్థాశ్రమంలో ఉన్నా సన్యాసి తోటిసమానము. నువ్వు పనిచెయ్యి, పనిచెయ్యగానీకు వచ్చిన ఆదాయంలో కుటుంబానికి కొంత ఉపయోగించుకొంటూ, సమాజానికి కూడా కొంత ఉపయోగించు, సామాజిక స్పృహకలిగిఉండు, జ్ఞానసముపార్జనకోసం మనం ప్రయత్నం చేస్తున్నాము. కాని జ్ఞానం కలగకపోవటానికి మన రాగద్వేషములే కారణం. రాగద్వేషములవలన మనస్సు బాహ్యముఖానికి పోతుంది. రాగద్వేషములు పెరుగుతూ ఉంటే మోహం పెరుగుతుంది. మోహంపెరిగితే జననమరణప్రవాహంలో కొట్టుకొనిపోతావు, ఇంక దానికి ముగింపుఉండదు. చాలామంది కష్టపడి సంపాదిస్తున్నారు. కాని ఇంటిదగ్గర పిల్లలు ఏమి చేస్తున్నారు, వారి స్నేహాలు, వాళ్ళ అలవాట్లు, పద్ధతులు ఎలాఉన్నాయి అని వారికి అక్కరలేదు. మనం సంపాదించి ఇచ్చింది నిలబెట్టుకొనే సమర్థత, వివేకం ఉన్నాయాఅని చూడటంలేదు. కొంతమంది అయితే పిల్లలు ఎలాఉన్నా మార్కులు మాత్రం నూటికి నూరు వస్తే చాలు, ఎంతసేపు మార్కుల గొడవే. ఏదిమంచిది, ఏదిచెడ్డది అనే విచక్షణ లేకపోతే ఎన్ని మార్కులు వచ్చినా ఏమీప్రయోజనం లేదు, చదువు, ధనం మంచిదే. ఆచదువు, ధనం వాడు

**ఈ సంచికలో......**

**సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు**


| | | |
|---|---|---|
| 21-1-03 | మల్కిపురం | 1 |
| 31-1-03 | గుండుగొలను | 6 |
| 08-2-03 | చించినాడ | 11 |

బాగుపడటానికి ఉపయోగపడాలి, కుటుంబం బాగుపడటానికి ఉపయోగపడాలి, సమాజానికి ఉపయోగపడాలి, అప్పడు ఈశ్వరునిదయకు పాత్రుడవుతాడు.

మనకు శరీరము, మనస్సు, లోకం తెలుస్తున్నాయి. మనహృదయంలో ఉన్న సత్యాన్ని అనుభవంలోనికి తెచ్చుకోవటానికి ఈ మూడింటిని ఉపయోగించుకో, వాటి ప్రయోజనం అంతవరకే. విద్యవలన కీర్తి వస్తుంది, విద్యవలన ధనం వస్తుంది. విద్యవలన అన్నీ తెచ్చిపెడుతుంది. ఇవిఅన్నీ సెకండరీ కాని విద్యవలన నీవు శీలం సంపాదించుకోవాలి. మనకు సహనం తగ్గిపోతోంది. సహనం లేకపోతే హృదయం యొక్క లోతులు పెరగవు మన కుటుంబంలో 10మంది ఉంటారు, వారి మనస్సులు రకరకాలుగా ఉంటాయి. వాటిని సమన్వయం చేసుకొంటూ మనం జీవించాలి. ఎవరితో సహవాసం చేస్తే మన ఆలోచనపెరుగుతుందో, మనహృదయం యొక్క లోతులు పెరుగుతాయో అటువంటి వారితో సహవాసం చెయ్యాలి. మీకు జ్ఞానం వస్తుందా రాదా అని సందేహంవద్దు, తప్పక జ్ఞానం వస్తుంది. మీకు ఉన్న వాసనలవలన, తలంపుల వలన, అలవాట్లవలన జ్ఞానం రాదేమో అనిపిస్తుంది. మీకు ఏదైనా కారణంవలన అశాంతి వచ్చింది అనుకోండి, కుటుంబంలో ఏదైనా కష్టం వచ్చింది అనుకోండి, మనస్సులో ఇబ్బంది పడుతున్నారు అనుకోండి మనకు జ్ఞానం రాదేమో అనుకొంటారు మీకు తప్పక జ్ఞానం వస్తుంది, జ్ఞానం కలిగే అర్హత మీకు లేకపోతే ఇక్కడకు రావాలనే సంకల్పం కూడా రాదు. భగవంతుడు మన హృదయంలో ఉన్నాడు, పనిచేస్తున్నాడు, అయితే మనలాగ గొప్పలకోసం పనిచేయటం లేదు, మనలను వికారరహితస్థితికి తీసుకొనివెళ్ళటానికి ప్రయత్నంచేస్తున్నాడు. మనలో ఏవికారములు ఉన్నాయో మనకు తెలియదు కాని భగవంతుడికి తెలుసు. ఆ వికారములను కెలుకుతాడు. అప్పడు కూడా మీకు అర్ధంకాకపోతే మీ అత్తగారిచేత తిట్టిస్తాడు. మాటను సహించేశక్తినీకు ఎంత ఉందో చూడటానికి ఎవరో ఒకరిచేత తిట్టిస్తాడు, నోరుమంచిది కానివారిని భగంతుడు ఉపయోగించుకొంటాడు, వారిని అందుకే పెట్టాడు. మనహృదయంలో ఉన్న వికారములను కెలికినపుడు మనకు ఎంతో కొంత పెయిన్ ఉంటుంది, మరల ఆ పెయిన్ భరించే శక్తిని కూడా ఆయనే ఇస్తాడు. భరించే శక్తిని ఇచ్చి ఆవికారములను కెలికి వాటిని తొలగించి మనహృదయాన్ని శుద్ధిచేసి, ఆయన తోటి సమానంచేసి ఆయన స్వరూపాన్ని మనకు ఇస్తాడు, వాడే భగవంతుడు.

భగవంతుడు మన హృదయంలోనే ఉన్నాడు. ఆయనను గుర్తించే యోగ్యత మనకు లేక అక్కడలేడు అనుకొంటున్నాము. మనకు వివేకంలేదు, బుద్ధిసూక్ష్మత లేదు. అన్నంతింటూ శరీరాన్ని పెంచుతున్నాము, బంధువులు, స్నేహితులు పెరుగుతున్నారు, అన్నీ పెరుగుతున్నాయి





కాని వివేకం పెరగటంలేదు. శరీరంలో గ్రోత్ ఉంది, బంధువులలో గ్రోత్ఉంది, స్నేహితులలో గ్రోత్ఉంది కాని జ్ఞానంలో గ్రోత్లేదు. మన తెలివితేటల వలన కామక్రోధములనుండి బయటపడలేము. భగవంతుడి పాదాలను ఆశ్రయిస్తే భగవంతుని నామాన్ని స్మరిస్తూ ఉంటే, భగవంతుడి రూపాన్ని ధ్యానిస్తూ ఉంటే, భగవంతుడివైభవాన్ని గుర్తిస్తూ ఉంటే మనలో ఉన్న కామక్రోధములను జయించటానికి తగినశక్తిని భగవంతుడు ప్రసాదిస్తాడు. మనం ఏ శరీరంలో ఉన్నప్పడు ఆశరీరం ఒక్కటే నిజం అనిపిస్తుంది. ఆశరీరం ఎటువంటిది అయినా ఇది ఎంత బాగుంది అనుకొంటాము, దేహవాసన అంత బలీయమైనది. మనకు జ్ఞానం కలుగకుండా ఎవరో ఇతరులు అడ్డురావటంలేదు. ఇప్పడు ఏదైతే మనకు నేనుగా వ్యక్తమవుతోందో, ఆనేను అనే తలంపే మనకు అడ్డువస్తోంది, ఇది తెలియటానికి కూడా మనకు కొన్నివేల జన్మలు పట్టవచ్చు. మనం సాధనచేసి తొలగించుకోవలసింది కూడా ఆనేనునే. అనే సాధన విషయంలో వాయిదాలు వేయవద్దు. దేహంతో తాదాప్యం పొందే ఈ నేనును తొలగించుకోవాలంటే పుణ్యబలం ఉండాలి, గుణసంపద ఉండాలి, మనలను ఎవరైనా చిన్నమాట అంటే మనకు వికారం వచ్చేస్తుంది. కాని రామచంద్రమూర్తిని అరణ్యవాసానికి వెళ్ళమని చెప్పిన వార్త విన్నప్పడు కూడా ఆయన మొఖంలో వికారం రాలేదు, అందుకే ఆయన దేవుడు అయ్యాడు. దేహబుద్ధి తగ్గించుకోవడానికి గుణసంపద అవసరం. గుణసంపద వచ్చాక నిన్ను అక్కడ నిలబెట్టడు, నిర్గుణస్థితికి తీసుకొని వెళ్తాడు. పుట్టలోనుండి పాము వచ్చినట్లు నీహృదయంలోనుండి నేను అనే తలంపు వస్తోంది. ఈనేను ఎవరు అని దానిని ప్రశ్నించు. దాని మీద నిఘా ఉంచు. పుట్ట దగ్గర కాపలా ఉంటే దానికి ఆహారం అందక కొన్ని రోజులకు పాము చనిపోతుంది. అలాగే ఈ నేను అనే తలంపును విచారణచేయటంవలన, దానిమీద నిఘా ఉంచటం వలన ఆనేను ఉదయించకుండా చూడటం వలన దానికి ఆహారం అందక అది నశిస్తుంది. భగవంతుడి శక్తి గురించి, ఆయన గొప్పతనం గురించి, జ్ఞానం గురించి మనకు తెలియకపోవటం వలన ఆయన పాదాల మీద మనకు భక్తికుదరటంలేదు. ఆయన పాదాలయందు భక్తికుదిరితే గాని మాయ మనకు దారి ఇవ్వదు. ఎవరి మార్గంలో వారు ప్రయాణం చేయండి, అనుకరణవద్దు. మీరు చేసే ప్రయత్నంలో చిత్తశుద్ధి ఉండాలి, కపటం పనికిరాదు. ఈ మార్గంలో మనం గమ్యానికి చేరగలము అని ఆమార్గంమీద నమ్మకంతో, ఆత్మవిశ్వాసంతో ప్రయాణంచేయాలి. మీ మార్గం నచ్చలేదు అని అందరూ మిమ్మల్ని వదిలేస్తారు అనుకోండి, మీరు మాత్రం ఒంటరిగా ప్రయాణంచెయ్యండి. వారికి నచ్చలేదు అని మీరు ఆ మార్గం విడిచిపెడితే మీరు స్వతంత్రులు కారు. స్వతంత్రుడు కానివాడికి జ్ఞానం రాదు. ఆమార్గంమీకు సుఖంగా

ఉన్నప్పుడు అందులో శాంతి వస్తూ ఉంటే ఆ మార్గంలో ప్రయాణం చెయ్యండి. మీకు ఇష్టులు ఎవరైనా, ఏదైనా ఆటంకాలు కలిగించినా వాటిని గెంటి, ముందుకు వెళ్ళిపోండి. మీ సంసారంలో ఏవైనా ఇబ్బందులు వచ్చినా కంగారుపడవద్దు, వాటికి పూర్వజన్మలకి సంబంధం ఉంటుంది, వాటిని అనుభవిస్తే పోతాయి. మనకు రెండు విద్యలు ఉన్నాయి, ఒకటి పారమార్థికం, రెండవది వ్యవహారికం, ఈ రెండుఅవసరమే మనం మోక్షం పొందటానికి పారమార్థికం, ఇతరుల చేత మోసపడకుండా చూసుకోవటానికి వ్యవహారిక జ్ఞానం. మనం ఇతరులను మోసంచేయకూడదు, ఇతరులయొక్క మోసంలో పడకూడదు. మనం సత్వగుణాన్ని అలవాటు చేసుకొంటున్నాము అనుకోండి, లోపలశాంతిని పెంచుకొంటున్నాము అనుకోండి మనకుటుంబంలోగాని, బయటగాని పరిస్థితులు వ్యతిరేఖంగా ఉన్నా కాలక్షేపంచేసి బయటకు వెళ్ళిపోవచ్చు, లోపలశాంతి ఉంటే అందులోనుండి ఆశక్తినీకు వస్తుంది. లోపలశాంతిని కాపాడుకొంటే బయట నుండి వచ్చే వత్తిడులను, కుటుంబపరంగా వచ్చే వత్తిడులను, సమాజపరంగా వచ్చే వత్తిడులను తట్టుకొనేశక్తి మనకు వస్తుంది.

కోరిక ఒక తలంపు, కోపం ఒక తలంపు, చావు ఒక తలంపు, పుట్టుక ఒక తలంపు జీవితంలో అన్నీ తలంపులే. నీకు ఎన్నితలంపులు వస్తూఉన్నా కంగారుపడవద్దు, ఈ తలంపులు ఎంతకాలం అయితే వస్తూ ఉంటాయో అంతకాలం నేను ఎవడను అనే ప్రశ్నను విడిచిపెట్టవద్దు. అది ఈ తలంపులన్నింటిని నాశనంచేసి చివరకు ఆతలంపు కూడానశిస్తుంది, అప్పడు నిజమైననేను నీకు తానుగా వ్యక్తమవుతుంది. నీకు ఏదైనా కష్టాలు వస్తూఉంటే కష్టాన్ని కష్టంగా చూడటం మానివెయ్యి, నీదృష్టి మార్చుకొంటే కష్టం కష్టంగా కనబడదు, నీ దృష్టిలో ఉన్న దోషాన్ని తీసివెయ్యి, భక్తుడికి భగవంతుడి యొక్క రూపాన్ని చూస్తూఉంటే ఒక్క కళ్ళేకాదు అన్నీ ఇంద్రియాలు ఆనందంలో తొనికిసలాడతాయి. భక్తుడు కానివాడికి అది రాయి కాని భక్తుడికి ఆరూపాన్ని చూసేటప్పటికి అన్ని ఇంద్రియాలు చల్లబడిపోతాయి, అన్ని ఇంద్రియాలకు ఆనందం వచ్చేస్తుంది. ఎవరైనా విమర్శిస్తే మీకు దుఃఖం వస్తుంది, అది ఒక ఫీలింగ్. ఎవరైనా స్తోత్రం చేస్తే మీకు సంతోషం వస్తుంది, అది ఒక ఫీలింగ్. ఈఫీలింగ్‌లే మనకొంపముంచుతున్నాయి. వీటిని వదిలివేస్తే మనస్సు వెళ్ళి గూటిలో పడిపోతుంది. సత్యాన్వేషణ ఒక్కటే ప్రధానం కాని మిగతా ఫీలింగ్స్ ఏమీ పట్టించుకోవద్దు. ఈశరీరం మరణించకముందే మనబుద్ధిలో ఉన్న దోషాలను శేషంలేకుండా తొలగించుకోవాలి. ఆ తొలగించుకొనే శక్తిని ఇమ్మని మనం పరమేశ్వరుని ప్రార్థించాలి. మనం ప్రార్థించవలసింది అదే. అదే మొదటి ప్రార్థన, అదే చివరి ప్రార్థన.





ఎందుచేతనంటే శరీరం మరణించే లోపు బుద్ధిలో ఉన్నదోషాలు తొలగించుకోకపోతే మరల కొత్త శరీరాలు వచ్చేస్తాయి. జీవులు రకరకాలుగా ఉంటారు, జీవులందరు మోక్షాన్ని అడగరు ధర్మ అర్ధ కామ మోక్షములను అడుగుతారు అందుచేత ధర్మాన్ని ఆచరించే బుద్ధిని ఇమ్మని అడిగేవారికి ఒకచెయ్యి, పైసాలు కావాలి అని అడిగే వారికి ఒకచెయ్యి, కోరికలు అడిగే వారికి ఒకచెయ్యి, ఇవి ఏమీ మాకు వద్దు మాకు మోక్షమే కావాలి అని అడిగే వారికి ఒక చెయ్యి ఇలాగ భగవంతుడు నాలుగుచేతులు పెట్టుకొన్నాడు. జీవులందరూ మోక్షాన్ని అడిగితే ఒక చెయ్యి సరిపోతుంది. మనలను ఎవరైనా ఆదరించేవారు ఉంటే మంచిదే కాని వారు మరణిస్తే ఆదరించే వారు మనకు కనబడరు అందుచేత మనం భగవంతుడి మీద ఆధారపడటం మంచిది. ఎందుచేతనంటే ఆచేతులకు చావులేదు. మనం ఆధార పడవలసిన చేతులు అవే. మీరు ఇతరులను అనుకరించవద్దు. మీకు నచ్చిన మార్గంలో ప్రయాణం చెయ్యండి, జ్ఞానగంగ మీ హృదయంలోనే ఉంది. మీరు లోపలకు వెళితే అది దొరుకుతుంది. వస్తువు ఎక్కడ ఉందో అక్కడ వెతకండి, అది మీకు దొరుకుతుంది.

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహ భాషణములు, 31-1-03, గుండుగొలను

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

మనం సత్వగుణాన్ని పోషించుకొంటే మన హృదయంలో ఉన్న భగవంతుడికి దగ్గరవుతాము. మనం రజోగుణంలో, తమోగుణంలో ఉంటే ప్రపంచానికి దగ్గరవుతాము. మీరు ఎన్నిగంటలు జపంచేసినా, ధ్యానంచేసినా మీరు రజోగుణం తగ్గించుకోకపోతే, తమోగుణం తగ్గించుకోకపోతే భగవంతుడికి దూరమవుతారు. మన చేతులు పనిమీద ఉండాలి, మనస్సు శాంతిలో ఉండాలి. దానివలన ఏకాగ్రత పెరుగుతుంది, జ్ఞాపకశక్తి పెరుగుతుంది. పనియందు శ్రద్ధ పెరుగుతుంది. గురువు ఎలా ఉంటాడు అంటే ఇక్కడ భగవాన్ చెపుతున్నారు. వాడు శాంతిలో ఊగిసలాడుతూ ఉంటాడు. అది లౌకికమైన శాంతి కాదు. అది అలౌకికమైన శాంతి, అభౌతికమైన శాంతి. అది ఈ లోకానికి, ఈ భూమికి సంబంధించిన శాంతికాదు. కొంతమంది ఈ భూమి మీద ఉన్నా వారు భూమికి సంబంధించిన మనుషులు కాదు. వారే జ్ఞానులు. వారు మనలాగే తింటూ ఉంటారు, తిరుగుతూ ఉంటారు కాని వారు భూమికి సంబంధించిన మనుషులు కాదు. ఎందుచేతనంటే ఈ శరీరం భూమిలో కలిసిపోయినా మనం ఉంటాము అన్న సంగతి వారికి తెలుస్తూ ఉంటుంది. నిప్పకి వేడి ఎంత సహజంగా ఉంటుందో వారికి శాంతి, దయ, ఓర్పు ఇవి అన్నీ అంత సహజంగా ఉంటాయి. ఈ సృష్టిలో ఉన్న దుఃఖం అంతా